

పలమనేరు మీదుగా భారీస్థాయిలో గ్రానైట్ అక్రమంగా తరలిపోతోంది. రోజూ పదుల సంఖ్యలో భారీ లారీల ద్వారా గ్రానైట్ దిమ్మెలను తమిళనాడుకు తరలిస్తున్నారు.తమిళనాడులోని గ్రానైట్ ఫ్యాక్టరీలకు కాకుండా సరాసరి చెన్నై హార్బర్‌కు ఈ గ్రానైట్ వెళ్తుందని, అక్కడి నుంచి విదేశాలకు తరలిస్తారని చెబుతున్నారు.స్థానిక మార్కెట్ కంటే మూడునాలుగురెట్లు డబ్బులు విదేశాలకు తరలించడం వలన దక్కుతుండడం వల్లే ఈ అక్రమరవాణా రోజురోజుకూ పెరిగిపోతోందని సమాచారం. ఈ గ్రానైట్ మన జిల్లాలోని క్వారీలనుంచే కాకుండా పొరుగున ఉన్న అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలనుంచి కూడా రవాణా అవుతోందని తెలిసింది.వాస్తవానికి క్వారీలనుంచి వెలికి తీసి రవాణాకు సిద్ధం చేసిన గ్రానైట్ దిమ్మెల కొలతలు తీసి, రాయల్టీ కట్టిన తరువాత మాత్రమే రవాణా చేయాలి.దీంతో ఒకట్రెండు గ్రానైట్ దిమ్మెలను తరలిస్తున్నట్లు రాయల్టీ చెల్లించి మిగిలిన గ్రానైట్ దిమ్మెలను అక్రమంగా తరలిస్తున్నారు.



పరిమితికి మించి రవాణా

సాధారణంగా ఏ వాహనానికైనా సరుకు రవాణా చేసేందుకు పరిమితి ఉంటుంది. లారీల సామర్థ్యాన్ని బట్టి ఇది నిర్ణయిస్తారు. లారీల్లో తరలించే సరుకు పరిమితికి మించి వుంటే రవాణాశాఖ అధికారులు తనిఖీ చేసి భారీగా జరిమానాలు విధిస్తుంటారు. 40 టన్నుల వరకూ పరిమితి వుండే కంటైనరు లారీల్లో దాదాపు 60 టన్నుల దాకా గ్రానైట్ దిమ్మెలు తరలిస్తున్నారు. దీని వల్ల రోడ్లు ఛిద్రమైపోతున్నాయి. వేసిన కొద్దిరోజులకే దెబ్బతిని గుంతలు పడుతున్నాయి.



పలమనేరు మీదుగా తమిళనాడుకు గ్రానైట్ దిమ్మెలు తీసుకు వెళ్తున్న భారీలారీలు

అడ్డూఅదుపూ లేని గ్రానైట్ అక్రమ రవాణా

పార్సిల్ లారీలను పోలిన విధంగా....

సాధారణంగా ఏ సరుకును లారీలో తరలించినా వర్షానికి,ఎండకు దెబ్బతినకుండా వుండేందుకు తార్పాల్ కప్పుతుంటారు.గ్రానైట్ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యాపారులు దిమ్మెలు పైకి కనిపించకుండా ప్లాస్టిక్ సంచులతో తయారు చేసిన తార్పాల్‌ను కప్పి రవాణా చేస్తున్నారు. క్వారీలో రవాణాకు సిద్ధం చేసిన గ్రానైట్ దిమ్మెల పై మైన్స్ శాఖ సిబ్బంది వివరాలు స్పష్టంగా నమోదు చేస్తారు. క్వారీలనుంచి అధికారికంగా తరలించే గ్రానైట్ దిమ్మెలకు మాత్రం తార్పాల్ కప్పని రవాణాదారులు అనధికారికంగా రవాణా చేసే దిమ్మెలకు మాత్రం తార్పాల్ కప్పి తమిళనాడుకు తరలిస్తున్నారు.

ఘాట్ రోడ్డయినా ఖాతరు లేదు

లారీల్లో పరిమితికి మించి గ్రానైట్ రవాణా చేసే స్మగ్లర్లు ఘాట్‌రోడ్‌ను సైతం ఖాతరు చేయడం లేదు. పలమనేరు నుంచి తమిళనాడుకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా ఘాట్‌రోడ్డు.ప్రమాదకరమైన మలుపులతో అటవీ మార్గంలో సాగుతుంది. ఏమాత్రం భారీ వాహనాలు ప్రమాదానికి గురైనా డ్రైవర్ల, క్లీనర్ల ప్రాణాలకే ప్రమాదం.ఇతర రహదారుల్లో పోలిస్తే వాహనాల రద్దీ నామమాత్రంగా వుంటుంది. అందువల్లే గ్రానైట్ రవాణాలో ఏ ప్రమాదాలు జరిగినా గుట్టు చప్పుడు కాకుండా అక్రమ రవాణాదారులు యుద్ధప్రాతిపదికన మరో వాహనంలోకి దిమ్మెలను మార్చుకుని వెళ్ళిపోతుంటారు.మరోవైపు వాహనాల్లో పరిమితికి మించి గ్రానైట్ దిమ్మెలు రవాణా అవుతున్నా దారిపొడవునా ఉన్న పోలీసు అధికారులు గానీ, రవాణా శాఖ అధికారులు గానీ పట్టించుకోకపోవడం అసలైన విశేషం. గ్రానైట్ అక్రమ రవాణాతో ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. క్వారీలనుంచి వెలికి తీసిన ప్రతి దిమ్మెకూ క్వారీ యజమాని నిర్ణీత మొత్తాన్ని రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి వుంది. అయితే గ్రానైట్ దిమ్మెల్లో సగానికి పైగా అక్రమ రవాణాలో గమ్యం చేరిపోతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

● ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

అలంకార ప్రాయంగా మైన్స్ కార్యాలయం

పలమనేరులోని మైన్స్ అండ్ జియాలజీ కార్యాలయం అలంకారప్రాయంగా మారిపోయిందని ప్రజలు బాహాటంగా విమర్శలు చేస్తున్నారు. పలమనేరు మీదుగా తమిళనాడుకు గ్రానైట్‌ను తీసుకు వెళ్లే ప్రతి భారీ వాహనం ఈ కార్యాలయం ముందునుంచే వెళుతోంది. అయితే ఏ వాహనంపై కూడా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు తమకేమీ సంబంధం లేనట్లు కళ్లు మూసుకోవడంపై భారీగా ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలున్నాయి.

- పలమనేరు, ఆంధ్రజ్యోతి

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

● వివిధ బ్యాంకుల ఉద్యోగుల డిమాండ్



చిత్తూరులోని ఎస్బీఐ ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): .బ్యాంకుల్లో అవసరమైన మేరకు నియామకాలు చేపట్టి, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం చిత్తూరులోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ప్రాంతీయ కార్యాలయం ఎదుట వివిధ బ్యాంకుల ఉద్యోగులు ధర్నా చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 24, 25 తేదీల్లో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో దేశవ్యాప్త బ్యాంకింగ్ సమ్మె చేపడతామని చిత్తూరు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ అధ్యక్షుడు టి.శేఖర్, ఏఐబీవోసీ యూనియన్ ప్రతినిధి కె.వినీష్ బాబు తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉద్యోగులు నినాదాలు చేశారు. ఎన్‌సీబీఈ ప్రతినిధి ఏకే శ్రీహరి, ఏఐబీఈఏ యూనియన్ ప్రతినిధి చెన్నకేశవ తదితరులు ప్రసంగించగా.. ప్రభుత్వ, సహకార, గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థుల డీబార్

చిత్తూరు సెంట్రల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులకు మంగళవారం పరీక్షలు జరిగాయి. వి.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెద్ద పెత్తున మాల్ ప్రాక్టీస్ జరుగుతుందన్న సమాచారంతో సిట్టింగ్ స్క్వాడ్‌తోపాటు ఫ్లైయింగ్ స్క్వాడ్, స్పెషల్ అధికారి, డీఈసీ కన్వీనర్‌లు ఏకకాలంలో తనిఖీలు చేశారు. దీంతో కాపీ కొడుతూ ముగ్గురు విద్యార్థులు పట్టుబడగా, డీబార్ చేసినట్లు డీవీఈవో, డీఈసీ కన్వీనర్ సయ్యద్ మౌల తెలిపారు. వీరిలో ఇద్దరు జనరల్ ఇంటర్ విద్యార్థులుండగా, ఒకరు ఒకేషనల్ విద్యార్థి. జిల్లావ్యాప్తంగా 50 సెంటర్లలో 17,180 మంది విద్యార్థులకు 16,156 మంది హాజరవగా, 1021 గైర్హాజరైనట్లు డీవీఈవో తెలిపారు. జనరల్ ఇంటర్‌లో 15,037 మందికి 14,225 మంది హాజరవగా, 810 గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 2143 మందికి 1931 మంది హాజరవగా, 211 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాల పర్యవేక్షణకు

ఎస్వోగా చక్రధర బాబు

● జోనల్ ఇన్‌చార్జిగా కృష్ణబాబు



చక్రధర బాబు - కృష్ణబాబు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును జిల్లాలో పర్యవేక్షించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లా, జోనల్ స్థాయుల్లో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను ఇంఛార్జి అధికారులుగా నియమించింది.అందులో భాగంగా జిల్లా ఇంఛార్జి అధికారిగా కేవీఎన్ చక్రధర బాబు నియమితులు కాగా చిత్తూరుతో పాటు ప్రకాశం, నెల్లూరు,తిరుపతి , అన్నమయ్య తదితర ఐదు జిల్లాలతో కూడిన జోన్‌కు ఇంఛార్జి అధికారిగా వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణ బాబు నియమితులయ్యారు. ఈ ఇద్దరు అధికారులకు ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

జిల్లా ఇంఛార్జి అధికారికి కీలక బాధ్యతలు

జిల్లా ఇంఛార్జి అధికారికి ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. జిల్లాలో తరచూ పర్యటిస్తూ ప్రభుత్వ కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలి. ఆ దిశగా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులకు సహకరించాలి. ప్రతి పదిహేను రోజులకోసారి జిల్లా అధికారులతో సమావేశమై సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును సమీక్షించాలి. గ్రామాల్లో పర్యటించడంతో పాటు నెలకు కనీసం రెండు సార్లు గ్రామాల్లో రాత్రిళ్ళు బస చేయాలి. ప్రజల నుంచీ వచ్చిన ఫిర్యాదులు పరిష్కారమవుతున్నదీ లేనిదీ సమీక్షించాలి. అవసరమైన చర్యలు తీసుకోవాలి. నెలవారీ పురోగతికి సంబంధించిన నివేదికలను జోనల్ ఇంఛార్జికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేయాలి.

జోనల్ ఇంఛార్జికి మార్గదర్శక బాధ్యతలు

ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న కార్యక్రమాలు, పథకాలు అమలు విజయవంతం కావడానికి వ్యూహాత్మక మార్గదర్శకత్వం అందించాలి. జిల్లాస్థాయిలో నెలవారీ సమీక్షా సమావేశాలు నిర్వహించాలి.ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల్లో పాల్గొనాలి.నెలకోసారి గ్రామాలను సందర్శించి రాత్రి బస చేయాలి. పారిశ్రామికవేత్తలు, రైతులు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు,పన్ను చెల్లింపుదారులతో సమావేశమై చర్చించాలి. కలెక్టర్ సహా జిల్లా అధికారులకు అవసరమైన శిక్షణ ఇవ్వాలి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార స్థితిని సమీక్షించాలి. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అవాంతరాలను గుర్తించి, వాటికి కారణాలేమిటన్నది విశ్లేషించాలి.ముఖ్యమైన ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు,నిధుల వ్యయం వంటి అంశాలను సమీక్షించాలి.జిల్లా పురోగతితో పాటు సమస్యలు,సిఫారసులతో కూడిన నివేదికలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేయాలి.

అక్కడక్కడా చిరుజల్లులు



మేఘావృతమైన చిత్తూరు నగరం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా మండుటెండలతో అల్లాడిస్తున్న సూరీడు మంగళవారం కరుణించాడు. జిల్లాలో అక్కడక్కడా చిరు జల్లులు కురిశాయి. ఉదయం నుంచే చిత్తూరు నగరమంతా మేఘావృతమై మబ్బులతో కనువిందు చేయగా, మధ్యాహ్నం చిరుజల్లులు కురిశాయి.రోజూ 37 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతుండగా, మంగళవారం 35 డిగ్రీలకు పడిపోయాయి. అత్యధికంగా పులిచెర్లలో 35.7, అత్యల్పంగా రామకుప్పంలో 28.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. మండలాలవారీగా నింద్రలో 34.4డిగ్రీలు, తవణంపల్లెలో 34.2, శ్రీరంగరాజపురంలో 34.1, నగరిలో 33.8, గుడుపల్లిలో 33.7, చిత్తూరు, గుడిపాలలో 33.5, సోమలలో 32.8, రొంపిచెర్ల, వెదురుకుప్పం, పెనుమూరుల్లో 32.7, పూతలపట్టులో 32.6, బంగారుపాళ్యంలో 32.4, చౌడేపల్లి, ఐరాల, పాలసముద్రం, విజయపురం మండలాల్లో 32.1, గంగాధరనెల్లూరులో 31.8, వి.కోటలో 31.7, యాదమరిలో 31.6, శాంతిపురంలో 31.5, సదుంలో 31.3, పుంగనూరులో 31, గంగవరంలో 30.8, బైరెడ్డిపల్లిలో 30.6, కార్వేటినగరం, పెద్దపంజాణి మండలాల్లో 30.5, పలమనేరులో 29.3, కుప్పంలో 28.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అన్నమయ్య సంకీర్తనల నడుమ

‘గరిమెళ్ల’ అంతిమయాత్ర

● పాటలతో శిష్యులు, అభిమానుల నివాళి
● ప్రభుత్వ లాంఛనాలతో బాలకృష్ణప్రసాద్ అంత్యక్రియలు



గరిమెళ్ల పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్



గరిమెళ్ల గౌరవార్థం గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తూ శిష్యులు, అభిమానులు ముందు నడుస్తుండగా.. ప్రముఖ సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అంతిమయాత్ర సాగింది. ఇలా పాటలతో నివాళులర్పిస్తూ.. కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో ఆదివారం గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ కన్నుమూయగా, మంగళవారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తిరుపతి నగరం భవానినగర్‌లోని గరిమెళ్ల ఇంటికి ఉదయం నుంచీ ఆయన అభిమానులు, శిష్యులు, ప్రముఖులు చేరుకున్నారు. పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా యంత్రాంగం అక్కడికి చేరుకుని నివాళులర్పించారు. జాతీయ పతాకాన్ని కప్పారు. అనంతరం అంతిమయాత్ర మొదలై.. హరిశ్చంద్ర శ్మశాన వాటిక వరకూ సాగింది. ఈ యాత్రలో ఆయన శిష్యులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తూ ముందుకు కదిలారు. శ్మశాన వాటికలో గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ గౌరవార్థం పోలీసులు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం పలికారు. ఆయన చిన్న కుమారుడు అనిల్‌కుమార్ చితికి నిప్పు అంటించారు. అంత్యక్రియల్లో గరిమెళ్ల బాలకృష్ణ సతీమణి రాధమ్మ, తనయుడు, కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యురాలు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, కాంగ్రెస్ నాయకురాలు ప్రమీలమ్మ, సీపీఎం నాయకుడు కందారపు మురళి, గాయని కర్రి విజయలక్ష్మి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, గాయని కొండవీటి జ్యోతిర్మయి, గాయకుడు కారుణ్య, టీటీడీ సీపీఆర్వో డాక్టర్ తలారి రవి తదితరులు నివాళులర్పించారు.



అంతిమయాత్రలో టీటీడీ సభ్యురాలు పనబాక లక్ష్మి, గాయని కొండవీటి జ్యోతిర్మయి

గరిమెళ్ల పాడిన పాటలను మరింత ప్రాచుర్యంలోకి తెస్తాం

అన్నమయ్య పాటలంటే గరిమెళ్లకు ప్రాణం. గరిమెళ్ల గొంతులో అన్నమయ్య పాటలు జీవం పోసుకున్నాయి. ఇంత గొప్ప సంగీతాన్ని గరిమెళ్ల పాడిన పాటలను మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తాం. - డాక్టర్ కర్రి విజయలక్ష్మి, గాయని

గరిమెళ్ల విగ్రహ ఏర్పాటుకు కృషి

ప్రపంచానికి అన్నమయ్య సంకీర్తనలను అందించిన గొప్ప వ్యక్తి గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్. అలాంటాయన మృతి తీరని లోటు. అనేక మంది గరిమెళ్ల అభిమానులు ఆయనకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించాలనీ, తిరుపతిలో గరిమెళ్ల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం. అన్నమయ్య కీర్తనలతో కూడిన పుస్తక ప్రసాదాన్ని భక్తులకు అందించేలా టీటీడీ కృషి చేయాలనీ పలువురు కోరారు. ఈ విషయాన్ని టీటీడీ దృష్టికి తీసుకెళతాం. ముఖ్యంగా తిరుపతిలో గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం.

- కలెక్టర్ వెంకటేశ్వర్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.28
సహరి (గురువారం) : 5.02

భక్తుల హడావుడిలో పాప మిస్

● పోలీసుల అప్రమత్తతతో క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు
● తిరుమలలో సంఘటన



దివ్యను రవికి అప్పగిస్తున్న పోలీసులు

తిరుమల నుంచి తిరిగి వెళ్లే హడావుడిలో ఐదేళ్ల చిన్నారిని ఒక కుటుంబం వదిలేసి వెళ్లిపోయింది. పోలీసుల అప్రమత్తతో ఆ పాప క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేరింది. మంగళవారం ఈ సంఘటన జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని హన్వాడకు చెందిన రవి, వెంకటేశ్వరి దంపతులు పదిమంది కుటుంబ సభ్యులతో సోమవారం తిరుమలకు వచ్చారు. దర్శనం చేసుకుని మంగళవారం ఉదయం తిరుపతికి బయలుదేరారు. ఈ హడావుడిలో తమ చిన్నారి దివ్య తమతో లేదనే విషయం గుర్తించకుండానే తిరుపతికి చేరుకున్నారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండులో పాప లేదని గుర్తించి ఆందోళనపడ్డారు. వెంటనే అక్కడ ఉన్న పోలీసు ఔట్‌పోస్టులో ఫిర్యాదు చేశారు. వారు వెంటనే తిరుమలకు సమాచారం ఇచ్చారు. తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం 3 వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా చిన్నారి కనిపించింది. సమాచారం తెలిసి తిరుమలకు వెళ్లిన దివ్య తండ్రి రవికి పాపను అప్పగించారు. సీఐ శ్రీరాముడు, సిబ్బందికి భక్తుడు ధన్యవాదాలు తెలిపారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

త్వరలో నా రెండో సినిమా

● 'బలగం' వేణు





వకుళాభరణం కృష్ణమోహన్ రావు

'బలగం' చిత్రంతో మంచి హిట్ కొట్టిన నటుడు, దర్శకుడు వేణు మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో తన రెండవ సినిమా దిల్‌రాజ్ బ్యానర్‌లో ప్రారంభం కానుందని చెప్పారు. ఈక్రమంలో స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానని తెలిపారు. కాగా, అంతకుముందు తెలంగాణ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.27 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,746

తలనీలాలు సమర్పించినవారు: 23,649

నెరవేరిన పేదింటి క్రీడాకారుడి కల

క్రీడల్లో రాణించి.. ఉద్యోగం సాధించి..





డీఆర్ఎం చేతుల మీదుగా మెడల్, సర్టిఫికెట్ అందుకుంటున్న కార్తీక్

బాల్‌బాడ్మింటన్‌లో విశేష ప్రతిభతో ఓ యువకుడు తన కలను సాకారం చేసుకున్నాడు. రైల్వేలో ఉద్యోగం సాధించి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచాడు. ఉద్యోగంలో చేరినా క్రీడాపరంపర కొనసాగిస్తున్నాడు. తిరుపతి రూరల్ మండలం కూపచంద్రపేటకు చెందిన పొన్న కార్తీక్ రెక్కాడితే డొక్కాడని కుటుంబంలో పుట్టాడు. తండ్రి లోకనాథం రేణిగుంటలో టింబర్‌డిపోలో పనిచేస్తాడు. తల్లి లత గృహిణి. గ్రామానికి సమీపంలోనే దుర్గసముంద్రం హైస్కూల్లో కార్తీక్ చదువుకున్నాడు. అక్కడి మైదానంలోనే రోజూ స్నేహితులతో ఆడేవాడు. ముఖ్యంగా బాల్‌బాడ్మింటన్ మక్కువ చూపేవాడు. తొలినాళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగం పొంది తల్లిదండ్రుల కష్టాలను తీర్చాలనేది కార్తీక్ బలమైన సంకల్పం. క్రీడల్లో బాగా రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగం వస్తుందని తెలుసుకున్నాడు. పట్టుదలతో కష్టపడ్డాడు. పీలేరులో జిల్లా సెలక్షన్స్‌లో ఎంపికై క్రీడా ప్రస్థానానికి శ్రీకారం చుట్టాడు. తరువాత వెనుతిరిగి చూడలేదు. విజయ పరంపర కొనసాగించాడు. రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు పతకాలను కైవసం చేసుకున్నాడు. 2018లో స్పోర్ట్స్ కోటా ఆధారంగా రైల్వేలో ఉద్యోగం పొందాడు. ప్రస్తుతం విశాఖపట్నంలోని సీనియర్ కమర్షియల్ కమ్ టికెట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు స్పోర్ట్స్ కోటాకింద రైల్వేలో ఉద్యోగం పొందిన ముగ్గురిలో కార్తీక్ కూడా ఒకడు. - తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి



గతేడాది రైల్వే టోర్నీలో విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న కార్తీక్

ఇప్పటికీ ఆడుతున్నాను

ఉద్యోగం వచ్చినా తనకు ఉపాధి చూపిన క్రీడను మర్చిపోలేదు. ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొంటున్నాను. అమ్మానాన్నల శ్రమ, అన్న రంజిత్, పీఈటీ టీచర్, బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధుల ప్రోత్సాహం నాకు తోడైంది. యువకులు కష్టపడి ఆడితే ఉద్యోగంతో పాటు క్రీడాకారుడిగా గుర్తింపు కూడా వస్తుందని గుర్తించాలి.

- పొన్న కార్తీక్

భార్యపై భర్త హత్యాయత్నం

● నిందితుడి అరెస్ట్



నిందితుడు హేమకుమార్



గాయపడిన లక్ష్మీప్రియ

పెళ్లకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతుల మధ్య అనుమానం పెనుభూతమై మనస్పర్థలు రేపింది. చివరకు భార్యపై భర్త హత్యయత్నానికి పాల్పడిన ఘటన పెళ్లకూరు మండలంలో జరిగింది. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు సమీపంలోని గుంటకింద పల్లె గ్రామానికి చెందిన హేమకుమార్, అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన పంతగాని లక్ష్మీప్రియ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారంతో నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. వివాహమైన కొద్ది నెలల నుంచే హేమకుమార్ భార్యపై అనుమానంతో తరచూ గొడవ పడేవాడు. ఇలా ఉండగానే వీరికి ఓ బిడ్డ జన్మించింది. తరువాత కూడా భర్త ప్రవర్తనలో మార్పు రాకపోయేసరికి లక్ష్మీప్రియ తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. కొన్నాళ్ల తరువాత మళ్లీ కలుసుకున్న వీరు శ్రీకాళహస్తిలో కాపురం పెట్టారు. ఆదివారం మధ్యాహ్నం లక్ష్మీప్రియను బైక్‌పై ఎక్కించుకున్న హేమకుమార్ పెళ్లకూరు మండలంలో టెంకాయతోపు సమీపంలోని పంటకాలువ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఈ క్రమంలో తన వెంట తెచ్చుకున్న కత్తి, స్క్రూడ్రైవర్‌తో లక్ష్మీప్రియపై హేమకుమార్ దాడి చేశాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న యువకులు గమనించి హేమకుమార్‌ను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. తొటంబేడు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని లక్ష్మీప్రియను శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పారిపోయేందుకు ప్రయత్నించిన హేమకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటన జరిగిన ప్రదేశం పెళ్లకూరు మండల పరిధిలోకి రావడంతో కేసును మంగళవారం ఆ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితుడిపై కేసు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

స్విమ్స్‌లో 12 ఏళ్ల బాలికకు అతి క్లిష్టమైన సర్జరీ



చికిత్స అనంతరం కోలుకున్న బాలికతో వైద్యులు

తిరుపతి(వైద్యం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఊపిరి తిత్తుల సమస్యతో స్విమ్స్‌కు వచ్చిన 12 ఏళ్ల బాలికకు అతి క్లిష్టమైన సర్జరీ చేసి ప్రాణాలు నిలబెట్టామని మెడికల్ సూపరింటెండెంట్ రామ్ మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లా మాచర్ల నగరానికి చెందిన సైదాబీ(12) అనే బాలిక ఊపిరి తిత్తుల సమస్యతో బాధపడుతుంటే కుటుంబ సభ్యులు స్విమ్స్‌కు తీసుకువచ్చారు. ఇక్కడ వైద్యులు పరీక్షించగా బాలిక ఊపిరి తిత్తులు, గుండెకు మధ్యలో పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సీటీ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో గత నెల 25న బాలికకు అతి క్లిష్టమైన సర్జరీ చేసి ఆ గడ్డను తొలగించారు. ప్రస్తుతం బాలిక పూర్తి ఆరోగ్యంగా కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. సాధారణంగా ఆ సర్జరీకి దాదాపు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని, స్విమ్స్‌లోని టీటీడీ ప్రాణదాన పథకంలో పూర్తి ఉచితంగా బాలికకు శస్త్ర చికిత్స అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య విభాగాధిపతులు అలోక్ సమంత్రే, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



కారు దహనం.. ప్రయాణికులు సురక్షితం

పాకాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదిపుట్ల బైలు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున కారులో మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. తిరుపతి వైపు నుంచి కొమ్మిరెడ్డిగారిపల్లె మీదుగా మదనపల్లెకు వెళ్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. కారులోని వారు దిగి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. పాకాల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలు ఆర్పారు. అగ్నిమాపక సిబ్బంది మనోహర్‌రెడ్డి, సురేంద్రబాబు, బాలాజీ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

18వరకు ఈకేవైసీ నమోదు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో రబీ సీజనుకు సంబంధించి ఈ-పంట నమోదు కోసం ఈకేవైసీని రైతులు ఈ నెల 18వ తేదీలోపు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రబీ 2024-25కు గాను 2,03,860 ఎకరాలకు సంబంధించి 72,966మంది రైతులు ఈ-పంట యాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా 1,94,805 ఎకరాలకు గాను 69,228మంది రైతులు ఈకేవైసీ చేసుకున్నారని వివరించారు. ఇంకా చేసుకోని రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 18వ తేదీలోపు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో 14వ తేదీ వరకు ప్రదర్శించి గ్రామసభల ద్వారా రైతుల వివరాలను చదివి వినిపిస్తారని తెలియజేశారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే 19వ తేదీలోపు రాతపూర్వకంగా తెలియజేస్తే సరిచేసి 22వ తేదీ తుది జాబితాను తయారుచేస్తారని వివరించారు.

ఎర్రచందనం స్వాధీనం: ఇద్దరు స్మగ్లర్ల అరెస్ట్

తిరుపతి, మంగళం, మార్చి 11: భాకరాపేట అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.40 లక్షల విలువచేసే 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి ఓలగేజ్ వాహనాన్ని, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు కథనం మేరకు.. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన బృందంలోని ఆర్ఎస్ఐ కేఎస్ కే.లింగాధర్ స్థానిక ఎఫ్‌బీవో రాజేశ్‌కుమార్‌తో కలసి మంగళవారం తెల్లవారుజామున దేవరకొండ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. తుమ్మచేనుపల్లి మట్టి రోడ్డు వద్ద మోటార్ సైకిల్‌పై ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడి వాహనాన్ని వెంబడించగా ఒక లగేజి వాహనం కనిపించింది. ఆ వాహనాన్ని చుట్టుముట్టగా అందులోని స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి ఇద్దరు స్మగ్లర్లను పట్టుకో గలిగారు. లగేజి వాహనంలో ఉన్న 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. ఎర్రచందనం దుంగలతో సహా వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడ్డ ఎర్రచందనంతో సహా స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

హోటల్ గదిలో కూలిన పీవోపీ

● అర్ధరాత్రి పరుగులు తీసిన భక్తులు





మినర్వా గ్రాండ్ హోటల్‌లో పెచ్చులూడిన పైనం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో సోమవారం అర్ధరాత్రి తర్వాత స్లాబుకున్న పీవోపీ ఊడి పడింది. దీంతో గదిలో ఉన్న భక్తులు భయాందోళనతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న ఐదుగురు భక్తులు మినర్వా గ్రాండ్ హోటల్‌లోని ఓ గదిని తీసుకున్నారు. వీరంతా గాఢనిద్రలో ఉండగా రూములోని పైకప్పునకు ఉన్న పీవోపీ ఊడి కింద పడింది. దీంతో పెద్ద శబ్దం రావడంతో భయంతో పరుగులు తీశారు. వెంటనే సీఐ రామకృష్ణ, ఎస్ఐలు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందు జాగ్రత్తగా అన్ని గదుల్లోని వారిని బయటకు పంపి వివిధ హోటళ్లలో అకామడేషన్ ఏర్పాటు చేశారు. హోటల్‌కు తాళం వేసి అన్ని శాఖల నుంచి అనుమతులు తీసుకుని.. హోటల్‌ను తెరిచేలా పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. అన్ని హోటళ్లలో భద్రతా ప్రమాణాలపై తనిఖీలు చేయడానికి మున్సిపల్, పోలీసు, అగ్నిమాపక అధికారులు సిద్ధమయ్యారు.

హోటల్ యాజమాన్యంపై కేసు

'హోటల్ గదిలో పీవోపీ పెచ్చులూడిన ఘటనలో మా అక్క చిన్ని చిల్లకుర్తి (66), తల్లి ప్రేమలత రామయ్య (85)కు గాయాలయ్యాయి. అమెరికాలోని చికాగోలో ఉంటున్న వీరు శ్రీవారి దర్శనానికి వచ్చారు. గాయపడిన ఇద్దరూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు' అంటూ అమెరికాలో నివాసం ఉంటున్న రాణి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హోటల్ యాజమాన్యంపై ఈస్ట్ సీఐ కేసు నమోదు చేశారు.

యూనిఫాం ఎంతో బాగుంది



విద్యార్థుల యూనిఫాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం కొత్తగా రూపొందించిన యూనిఫాం ఎంతో బాగుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ కొత్త యూనిఫాం అమల్లోకి రానుందన్నారు. అమరావతిలోని విద్యాశాఖ మంత్రి లోకేశ్ కార్యాలయంలో ఈ యూనిఫాంను బొజ్జల మంగళవారం పరిశీలించారు.ఎలాంటి రాజకీయ గుర్తులు లేకుండా యూనిఫాం ఉండటం కూటమి పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు.

సెలవుపై జాయింట్ కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఈ నెల 16వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. ఆయన స్వగ్రామమైన ఉత్తరాఖండ్ నైనిటాల్‌కు వెళ్లారు. తిరిగి 17నుంచి విధులకు హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు.

పీ4 సర్వేపై గ్రామసభలు నిర్వహించండి

● కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పీ4 సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి వివిధ అంశాలపై డీఆర్వో నరసింహులతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సున్నా పేదరికం లక్ష్యంగా నిర్వహిస్తున్న పీ4సర్వేలో భాగంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వెనుకబడిన ప్రాంతాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను శనివారంలోపు పూర్తిగా నిలిపివేయాలని, ఎవరూ వినియోగించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వే, వర్క్‌ఫ్రం హోమ్ సర్వేను 15వ తేదీలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో సుశీలాదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోష్మాండ్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక

● అందుబాటులో 1,37,686 టన్నులు ● అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శకంగా ఇసుక ఉచితంగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో మూడు డిసిల్టేషన్ పాయింట్ల నుంచి సుమారు 1,37,686 టన్నుల ఇసుక ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తిరుపతి ప్రజలకు మూడు స్టాక్ పాయింట్లను ఉచిత విధానంలో ఇసుక సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.ఈ స్టాక్ పాయింట్లకు అన్నమయ్య జిల్లాలోని రీచ్‌ల నుంచి ఇసుక తీసుకొస్తున్నట్లు వివరించారు. జిల్లాలో గుర్తించిన మూడు డిసిల్టేషన్ పాయింట్లలో రెండు పెళ్లకూరు మండలం, మరొకటి కోట మండలం గూడలిలో ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు ఇసుక సరఫరాను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ పాయింట్ల వద్ద ఇసుక తవ్వడానికి, రవాణాకు ఏజెన్సీని నియమించామని, వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ లేదా నేరుగా వెళ్లి ఇసుక కమిటీ నిర్ధారించిన నామమాత్రపు రుసుం చెల్లించి తీసుకెళ్లవచ్చన్నారు. ఇసుక డిసిల్టేషన్ పాయింట్లను సంబంధిత ఆర్డీవోలు తనిఖీ చేయాలన్నారు. ఎస్పీ హర్షవర్ధనరాజు మాట్లాడుతూ.. అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6వరకు ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గుడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, జిల్లా గనులశాఖ అధికారి బాలాజీ నాయక్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

హైవేలో రాంగ్ రూట్ ప్రయాణం

● 107 వాహనాలు స్వాధీనం



తిరుపతి(నేరవిభాగం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో గత కొంత కాలంగా హైవేపై రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నట్లు గుర్తించిన పోలీసులు మంగళవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి, సీఐ చిన్నగోవిందు, ఎస్ఐలు షేక్ షావలి, రామకృష్ణ, సిబ్బంది కలిసి తనిఖీల్లో పాల్గొన్నారు. రాంగ్ రూట్‌లో, ఆపోజిట్ డైరెక్షన్‌లో వాహనాలు నడిపిన దాదాపు 107 వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 27 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రూ 1.85 లక్షలు జరిమానా విధించినట్లు సీఐ చెప్పారు.

సీపీఐ నారాయణ హెచ్చరికతో

మద్యం షాపు తరలింపు

స్పందించి ఆరా తీసిన కలెక్టర్... షాపు తరలించాలని ఆదేశం

తిరుపతి/తిరుపతి(నేరవిభాగం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల సాయినగర్ పంచాయతీలో ఇళ్ల మధ్య మద్యం షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంపై సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ చేసిన హెచ్చరికతో మద్యం షాపును అధికారులు మరోచోటకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. నారాయణ ప్రకటన నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఆరా తీసి సమస్య పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. దీనికి సంబంధించిన వివరాలిలా వున్నాయి. జిల్లావ్యాప్తంగా కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం 23 మద్యం షాపులు కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా తిరుపతి రూరల్ మండలంలో సీరియల్ నంబరు 20వ షాపును దక్కించుకున్న వ్యక్తులు అవిలాల సాయినగర్ పంచాయతీలో ఫ్రెండ్లీ వైన్స్ పేరిట ఏర్పాటు చేశారు. అయితే షాపు జనావాసాల నడుమ వున్నందున అక్కడి నుంచీ తొలగించాలని కొద్ది రోజులుగా స్థానిక మహిళలు ఆందోళన చేస్తున్నారు. వారికి సీపీఐ నేతలు మద్దతుగా రంగంలోకి దిగారు. ఇటీవల షాపు బ్యానర్లను సైతం తగలబెట్టారు. ఈ నేపథ్యంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మంగళవారం తిరుపతి వచ్చారు. మద్యం షాపు వివాదం గురించి తెలుసుకుని బుధవారం నుంచీ అక్కడే బైఠాయిస్తామని, తొలగించే వరకూ ఆందోళన విరమించేది లేదంటూ హెచ్చరించారు. ఆ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు కలెక్టర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ఆరోపించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ విషయం ఏమిటని ఆరా తీశారు. ఇళ్ల మధ్య వైన్ షాపు వద్దని, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నపుడు షాపును అక్కడ నుంచీ మరో చోటకు తరలించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. కాగా, సాయినగర్‌లో ఏర్పాటు చేయదలచిన గీత కార్మికుడి ఫ్రెండ్లీ వైన్స్ మద్యం షాపు స్థానిక ప్రజలు, వామపక్ష పార్టీల ఆందోళన నేపథ్యంలో అక్కడ ఏర్పాటు చేయదలచిన దుకాణాన్ని వేరొక చోట ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గీత కార్మికుల కోసం దాదాపు 23 దుకాణాలు కేటాయించామన్నారు. అయితే ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాలేదని సాయినగర్‌లో ప్రజల విజ్ఞప్తి మేరకు అక్కడ నుంచి వేరొక చోట ఏర్పాటు చేసుకునేలా దుకాణం నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశామన్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు గమనించాలని కోరారు.





రైతు బజార్లు కావాలి

అన్నదాతలకు ఉపయోగపడే రైతు బజార్లను గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఏర్పాటు చేయాలి.చంద్రబాబు ముఖ్యమంత్రిగా 1999వ సంవత్సరంలో ప్రారంభించిన ఈ రైతు బజార్లు బాగా పాపులర్ అయ్యాయి. మధ్యవర్తులు లేకుండా పండించిన పంటలను రైతులే స్వయంగా రైతు బజార్లలో అమ్ముకుని లాభాలు గడించారు.మా నియోజకవర్గం గ్రామీణ ప్రాంతం కాబట్టి అంతా వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తారు.మా ఏరియాలో పండించిన పంటలను అమ్మడానికి చిత్తూరు, తిరుపతికి వెళ్లాల్సిరావడం రైతులకు ఇబ్బందిగా వుంటోంది. దీంతో మధ్యవర్తులకు అమ్మాల్సి రావడం వల్ల రైతులకు లాభం రావడం లేదు. మా నియోజకవర్గం నుంచి నారాయణస్వామిని రెండు సార్లు గెలిపించారు.ఆయన డిప్యూటీ సీఎం హోదాలో కూడా పనిచేశారు.అయితే ఎప్పుడూ అసెంబ్లీలో అభివృద్ధి గురించి కానీ, రైతుల గురించి కానీ మాట్లాడలేదు. బూతులు మాట్లాడడానికే అసెంబ్లీని ఉపయోగించుకున్నాడు.మా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఆరు రైతు బజార్లు మంజూరు చేయాలని కోరుతున్నా.

- వీఎం థామస్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే

ఇలాగైతే అవినీతి ఎలా వెలుగు చూస్తుంది?



పుత్తూరు మున్సిపాలిటీలో అప్పటి పాలకులు ప్రతి పనిలో దోపిడీకి పాల్పడ్డారు. కౌన్సిల్ సమ్మతి లేకుండా, టెండర్లు పిలవకుండా చాలా పనులు చేశారు. నిబంధనలను పాటించలేదు. ఇలా మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై కమిషన్ వేసినందుకు మంత్రికి ధన్యవాదాలు. అయితే, అక్రమాలు జరిగాయని చెబుతున్న కాలంలో పనిచేసిన వారే ఈ కమిషన్‌లో సభ్యులుగా ఉన్నారు. ఇలాగైతే అక్రమాలు ఎలా వెలుగు చూస్తాయి? చిత్తశుద్ధి కలిగిన వారిని విచారణాధికారులుగా నియమించాలి.

- గాలి భానుప్రకాష్, నగరి ఎమ్మెల్యే

ప్రాథమిక విచారణ పూర్తయింది

పుత్తూరు మున్సిపాలిటీలో ఎస్ఎస్ ట్యాంక్ రిపేర్ పనులకు టెండర్లు పిలవకుండా రూ.45.82 లక్షలకు శ్రీహర్ష ఎర్త్ మూవర్స్‌కు నామినేషన్ పద్ధతిన అప్పగించారు. ఇది నిబంధనలకు విరుద్ధం. రూ.5.9 లక్షలకు కాలువలు శుభ్రపరిచే పనులను 32 వర్క్‌లుగా విభజించి.. ఒకేరోజు పేమెంట్ చేశారు. రూ.2.5 లక్షల స్వచ్ఛభారత్ పెయింటింగ్ పనిని 15 వర్క్‌లుగా విభజించారు. మొదటి సారి స్క్రాప్‌ను రూ.3.8 లక్షలకు అమ్మారు. ఆర్డీ విచారణలో ఎస్టిమేషన్ తయారీ, టెక్నికల్ ఆమోదం, టెండర్ ఈ-ప్రొక్యూర్‌మెంట్, వర్క్ ఆర్డర్ ఇష్యూ, ఎంబుక్ నమోదు, థర్డ్‌పార్టీ కంట్రోల్ వంటివి లేవని తేలింది. ఇప్పటి వరకు ప్రాథమిక విచారణ పూర్తయింది. మున్సిపల్ కార్యాలయం, డంపింగ్ యార్డ్, 14వ ఆర్థిక సంఘం తదితర అంశాలపై ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరిన విధంగా విచారణ చేయిస్తాం. 2019-24 కాలంలో పనిచేసిన అధికారులకు విచారణ విధులు కేటాయించం.

- మంత్రి నారాయణ స్పందన

టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యం



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. కుటుంబ ఆస్తుల్లో మహిళలకు సమాన హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. ఇపుడు మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. 7,471 పట్టణ పేద మహిళలకు రూ.645.52 కోట్ల బ్యాంకు రుణాలు పంపిణీ చేశారన్నారు. ఒక్కో మహిళకు రూ.50 వేల నుంచి రూ.2లక్షల వరకు రుణాలు అందించారని తెలిపారు. డ్వాక్రా ఉత్పత్తుల విక్రయానికి సంబంధించి ఫ్లిప్‌కార్ట్ సంస్థతో ఒప్పందం కుదిరిందని వివరించారు. నేతలు మోహన్‌రాజ్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థులు అడవిలో ప్రత్యక్షం



కార్తీక్‌నాయక్, అరుణ్‌కుమార్‌లతో ఎస్ఐ వెంకటమోహన్

రామకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రామకుప్పం సమీపంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయం నుంచి సోమవారం అదృశ్యమైన విద్యార్థులు మంగళవారం ఉదయం గురుకులమడుగు అడవిలో ప్రత్యక్షమయ్యారు. ఎస్ఐ వెంకటమోహన్ కథనం మేరకు... రామకుప్పం మండలం వీర్నమలతాండాకు చెందిన కార్తీక్‌నాయక్, రాజుపేటకు చెందిన అరుణ్‌కుమార్ రామకుప్పం పట్టణ శివార్లలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు విద్యాలయం నుంచి వెళ్లిపోయారు. సాయంత్రం 6 గంటలైనా వారిద్దరూ తిరిగి రాకపోవడంతో విద్యాలయం ప్రిన్సిపాల్ రమేష్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం విద్యార్థులు మండల పరిధి గురుకులమడుగు అటవీ ప్రాంతంలో ఉండగా అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని వారిని గురుకుల విద్యాలయానికి తీసుకొచ్చి తల్లిదండ్రుల సమక్షంలో ప్రిన్సిపాల్ రమేష్‌కు అప్పగించారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

సర్పంచ్‌ల అధీనంలో సచివాలయాలు పనిచేసేలా చూడండి

మంత్రికి సర్పంచ్‌ల సంఘం వినతి



మంత్రిని సన్మానిస్తున్న చుక్కా ధనంజయయాదవ్

విజయపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల అధీనంలో సచివాలయాలు పనిచేసేలా చూడాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్ కోరారు. ఈ మేరకు గ్రామ సచివాలయాల శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులును అమరావతి సచివాలయంలో మంగళవారం కలిసి విన్నవించారు. సర్పంచ్‌లకు అధికారాలను రోజు రోజుకు కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, పంచాయతీ రాజ్ చాంబర్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి, పలువురు పంచాయతీ రాజ్ చాంబర్ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సదుం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సదుంలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో ఇంటర్ ఎంపీసీ, బైపీపీ గ్రూపులతో పాటు ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు.





జాబ్ మేళాలో పాల్గొన్న కడా పీడీ, పీఎస్ఎం తదితరులు - జాబ్ మేళాకు హాజరైన యువత

కడా జాబ్ మేళాలో 700 మందికి ఉద్యోగాలు

కుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో కడా ఆధ్వర్యంలో 1ఎం1బి (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) పర్యవేక్షణలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. కుప్పం మండల సచివాలయం, ప్రభుత్వ భవనాల సముదాయంలో జరిగిన ఈ మేళాను కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేష్ బాబు, 1ఎం1బి వ్యవస్థాపకులు మనవ్ సుబోధ్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కడా పీడీ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలోని స్థానిక యువత పరిశ్రమల నిపుణులతో నేరుగా కలుసుకుని తమ నైపుణ్యాలను ప్రదర్శించి ఉద్యోగాలు పొందడానికి అవకాశం లభించిందన్నారు. కుప్పం ప్రాంత యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, పరిశ్రమల భాగస్వాములతో అనుసంధానం ఏర్పరిచేందుకు, ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు కడా తరఫున చేస్తున్న ప్రయత్నాల్లో ఇది మొదటి అడుగన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయ సాధనకు ఈ జాబ్ మేళా ఎంతో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. అలాగే గ్రీన్ స్కిల్స్ అకాడమి కెరీర్ రెడినెస్ సెంటర్‌తో యువతకు ఉపాధి అవకాశాలు మరింతగా పెంచడానికి భవిష్యత్తులో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్వర్ణ కుప్పం విజన్ 2029 దిశగా కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేయడానికి వేసిన ప్రణాళికలు కొనసాగుతాయని చెప్పారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, టీడీపీ నాయకుడు డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు భవిష్యద్దర్శకుడని పేర్కొన్నారు. ఆయన నిర్దేశకత్వంలో కుప్పంలోని యువత ఎన్నో అవకాశాలను పొంది భవిష్యత్తునుఎంతో ఉన్నతంగా తీర్చుదిద్దుకుంటుందన్నారు. 1ఎం1బి వ్యవస్థాపకుడు మనవ్ సుబోధ మాట్లాడుతూ తమ కన్సల్టెన్సీ నిర్వహించిన జాబ్ మేళా యువతకు టాప్ రిక్రూటర్లతో నేరుగా కలిసే వేదికను అందించిందన్నారు. యువతకు అవసరమైన సాఫ్ట్ స్కిల్, వృత్తిపరమైన శిక్షణ ఇస్తూ వారు మరిన్ని ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. కుప్పం నియోజకవర్గం నుంచే కాకుండా జిల్లా వ్యాప్తంగా యువత ఈ మేళాకు తరలివచ్చింది. సుమారు 700 మంది యువతీ యువకులను రిటైల్, ఎలక్ట్రానిక్స్, టెలికాం, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, విద్య వంటి రంగాలలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలలోని వివిధ కంపెనీలలో ఉద్యోగాల్లో నియమించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు టీటీడీ బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కన్నన్, జనసేన నరేష్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకేఎన్‌లో త్వరలో 'యూత్ పార్లమెంట్'

చిత్తూరు సెంట్రల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ త్వరలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం తిరుపతి ఎస్వీయూలోవీసీ అప్పారావు,రిజిస్ట్రార్ భూపతినాయుడితో కలిసి ఆవిష్కరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. వాల్ పోస్టర్ ఆవిష్కరణలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవో భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో సమస్యలపై 18న చిత్తూరులో సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి వివిధ పార్టీల అధ్యక్షులు, సీనియర్ నాయకులతో ఈనెల 18న సమావేశం ఏర్పాటు చేసినట్లు డీఆర్వో మోహన్ కుమార్ తెలిపారు. ఓటరు నమోదు అధికారి, జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో పరిష్కరించబడని సమస్యలపై ఏప్రిల్ 30న అన్ని రాజకీయ పార్టీలనుంచి భారత ఎన్నికల సంఘం సలహాలు, సూచనలను ఆహ్వానించిందన్నారు. ఇందులో భాగంగా 18న చిత్తూరు కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని సూచనలు, సలహాలు అందించాలన్నారు.

అప్పుల పాల్జేసిన బోర్ల సేద్యం

- ఆత్మహత్యకు ప్రయత్నించిన రైతు మృతి



హరి (ఫైల్ ఫొటో)

రామకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు కోసం తవ్వించిన బోర్లు ఆదుకోకపోవడంతో అప్పుల పాలై ఆత్మహత్యకు ప్రయత్నించిన రామకుప్పం మండలం వెంకటాపురానికి చెందిన రైతు హరి గత వారం రోజులుగా మృత్యువుతో పోరాడి సోమవారం సాయంత్రం కన్నుమూశాడు. రైతు హరి తనకున్న రెండెకరాల పొలంలో సేద్యం చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లల్ని పోషించుకుంటున్నాడు. ఏడాది క్రితం పొలంలో బోరు తవ్వించినా నీరు పడలేదు. దీంతో తిరిగి అప్పు చేసి ఆరునెలల క్రితం మరో బోరు తవ్వించాడు. ఆ బోరులో నీరు రావడంతో ఇక తమ బతుకులు మారి, అప్పులు తీరుతాయని భావించి పంటల సాగు చేపట్టాడు. ఆ బోరులోనూ జలాలు అడుగంటిపోవడంతో సాగు చేసిన పంట ఎండిపోయింది. కనీసం పశువులకు పశుగ్రాసం పండించుకోలేని పరిస్థితి ఏర్పడింది. బోర్ల తవ్వకాలు, పంటలకు పెట్టుబడి కోసం హరి రూ.5 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ పరిస్థితుల్లో చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనస్థాపానికి గురైన హరి పంట సాగు కోసం తెచ్చిన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం అతడిని కుప్పం పీఈఎస్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ 15 రోజులపాటు వెంటిలేటర్‌పై చికిత్స పొంది కోలుకుని ఇంటికి చేరాడు. కొద్ది రోజుల అనంతరం అతనికి ఊపిరాడటంలో ఇబ్బంది ఏర్పడటంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. కాగా రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన లోకేశ్ అనే యువకుడు హరి పరిస్థితిని వివరిస్తూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను ట్యాగ్ చేస్తూ ఎక్స్, ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టాడు. ఎక్స్‌లో పోస్టుకు మంత్రి లోకేశ్ స్పందించారు. తన టీం హరిని ఆదుకునేందుకు కృషి చేస్తుందని, సాధ్యమైన ప్రతి సహాయాన్ని అందజేస్తుందని ఆయన ఎక్స్ ద్వారా భరోసా ఇచ్చారు. అయితే అతని పరిస్థితి విషమించి మృత్యువు కబళించింది.

టీడీపీ ఆర్థికసాయం



హరి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రైతు హరి మృతి పట్ల టీడీపీ నేతలు తమ సంతాపం వ్యక్తం చేశారు. మాజీ రెస్కో డైరెక్టరు గంట్లరెడ్డి, పార్టీ యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, ఐటీడీపీ మండల అధ్యక్షుడు సురేష్, స్థానిక నేతలు మునిరత్నం, చంద్రశేఖర్ తదితరులు హరి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

సారా రహిత రాష్ట్రాన్ని సాధిద్దాం

- ప్రజలకు ఈఎస్ శ్రీనివాస్ పిలుపు
- సారాపై సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 14405కు ఫిర్యాదు చేయాలని సూచన



ఈఎస్ శ్రీనివాస్



ప్రచార వాహనం

చిత్తూరుసిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సారా రహిత రాష్ట్రాన్ని సాధిద్దామని ప్రజలకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సారా రహిత నిర్మూలన కోసం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. సారా తాగడంవల్ల ఆరోగ్యపరంగా, సామాజిక పరంగా ఎన్నో దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సారా నిర్మూలనలో భాగంగా ముడిసరుకైన బెల్లం.. సారా తయారీ దారులకు అందకుండా చేయడానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందుకోసం బెల్లం మండి వ్యాపారులతో సమావేశం నిర్వహించి తగిన ఆదేశాలు ఇస్తున్నామన్నారు. బెల్లం సరఫరా చేసినట్లు తేలితే అటువంటి వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు స్పష్టం చేశారు. సారా తయారు చేసినా, రవాణా చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు, ఆటో ప్రచారాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఎక్కడైనా సారాపై సమాచారం తెలిస్తే ప్రజలు టోల్ ఫ్రీ నెంబరు 14405కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

అత్యాచారం కేసులో నలుగురి అరెస్టు

వెదురుకుప్పం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నలుగురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ సయ్యద్ అహ్మద్ అజీజ్ తెలిపారు. కార్వేటినగరం మండలంలోని ఓ ఎస్సీ కాలనీకి చెందిన 17 ఏళ్ల బాలికపై పి.దినేష్ గత ఏడాది నవంబరు నెలలో అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయమై బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో ఎస్ఐ పి.రాజ్‌కుమార్ కేసు నమోదు చేశారు. తర్వాత దినేష్‌ను అరెస్టు చేశారు. అతడికి సహకరించిన నాగరాజు, టి.దినేష్, పవన్, జయరాంలను మంగళవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

అదనంగా పరిహారం ఇవ్వండి

చిత్తూరు-తచ్చూరు రోడ్డుకోసం భూములు కోల్పోయిన రైతుల పక్షాన సీపీఐ వినతిపత్రం



మిట్టూరులో సీపీఐ శ్రేణులతో నారాయణ

చిత్తూరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మంగళవారం చిత్తూరు కలెక్టరేట్‌కు వచ్చారు. చిత్తూరు-తచ్చూరు రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు అదనంగా నష్టపరిహారం ఇవ్వాలని కలెక్టరును కోరినట్లు ఆయన తెలిపారు. తిరుగు ప్రయాణంలో మిట్టూరులో కాసేపు ఆగి పార్టీ శ్రేణులతో కలిసి టీ తాగారు.ఆయన వెంట సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి నాగరాజు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదులో పొరబాట్లుండకూడదు : డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆధార్ నమోదులో పొరబాట్లు లేకుండా చూసుకోవాలని డీఆర్వో మోహన్‌కుమార్ ఆదేశించారు.ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్డేషన్‌పై సంబంధిత అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. సంక్షేమ పథకాల ఎంపికకు ఆధార్ కార్డు ప్రధానమన్నారు. జిల్లాలో 117 గ్రామ, వార్డు సచివాలయాలు, ఏడు మీ-సేవ కేంద్రాలు, తొమ్మిది పోస్టాఫీసులు, తొమ్మిది బీఎస్ఎన్ఎల్ ఆఫీసులు, 14 బ్యాంకు బ్రాంచ్‌లు, 34 వైద్య కుటుంబ సంక్షేమశాఖ కార్యాలయాల ద్వారా 226 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. 5-7 ఏళ్ల మధ్య ఓసారి, 15-17 ఏళ్ల మధ్య మరోసారి ఆధార్ అప్డేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. గత నెలరోజుల్లో 60,519 మందికి ఆధార్ నమోదు, అప్డేషన్ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు.

'ఎంపీ ల్యాడ్స్' పనులు త్వరగా పూర్తిచేయండి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎంపీల్యాడ్స్ కింద మంజూరైన పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పనుల పురోగతిపై పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్షించారు. పంచాయతీరాజ్‌శాఖలో రూ.3.07 కోట్లతో 59 పనులు మంజూరవగా, రూ.2.17 కోట్ల విలువైన 48 పనులు పూర్తిచేశామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో రూ.75 లక్షలతో 17 పనులు మంజూరగా, రూ.43.58 లక్షలతో 14 పనులు ఇప్పటివరకు పూర్తిచేశామని వివరించారు. మున్సిపల్‌శాఖలో రూ.75.57 లక్షలతో ఎనిమిది పనులు మంజూరవగా, రూ.25.72 లక్షల విలువైన నాలుగు పనులు పూర్తిచేసినట్లు చెప్పారు. ఇతర శాఖలకు చెందిన 90 పనులు రూ.4.84 కోట్లతో చేపట్టగా 59 పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు జరిగాయన్నారు.

ఆరవ తరగతికెళ్లే విద్యార్థులపై శ్రద్ధ పెట్టండి

- విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆరో తరగతికెళ్లే విద్యార్థులపై శ్రద్ధ పెట్టాలని విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణతో కలిసి ఐదో తరగతి విద్యార్థుల్లో తెలుగు, గణితం తదితర పాఠ్యాంశాల్లో అభ్యసనా సామర్థ్యం పెంపుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంఈవోలు, హెచ్ఎంలతో సమీక్షించారు. రానున్న 40 రోజులు ఎంతో కీలకమని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. ఆరో తరగతికి వెళ్లే విద్యార్థుల్లో తెలుగు, గణితం, ఆంగ్లం తదితర పాఠ్యాంశాల్లో కనీస జ్ఞానం పొందేలా ప్రధానోపాధ్యాయులు, టీచర్లు కృషిచేయాలన్నారు. పిల్లల తల్లిదండ్రులతోనూ చర్చించాలన్నారు. చదువులో వెనుకబడ్డ ఐదో తరగతి విద్యార్థుల జాబితాను మండలాలవారీగా సిద్ధంచేసి, ఎంఈవోలకు పంపడం జరిగిందన్నారు. అటువంటివారికి మెరుగైన విద్యను అందించాలని ఆదేశించారు.

ఏనుగులను తరమడానికి ప్రయత్నించకండి

ట్రైనీ ఐఎఫ్ఎస్ సంకేత్ సూచన



నాంపల్లె అటవీ ప్రాంతంలో సంకేత్ తదితరులు

ఐరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలో ఏనుగుల బెడద లేకుండా చూస్తామని ట్రైనీ ఐఎఫ్ఎస్ చిత్తూరు వెస్ట్ రేంజ్ ఇన్‌చార్జి సంకేత్ అన్నారు. మంగళవారం నాంపల్లె అటవీ ప్రాంతాన్ని తన సిబ్బందితో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఏనుగుల బెడద ఎక్కువగా ఉందన్నారు. ఏనుగులను చూసిన వెంటనే వాటిని తరమడానికి ఎవ్వరూ ప్రయత్నించ వద్దన్నారు. ఏనుగులు పంట పొలాలపై దాడి నిర్వహిస్తే అటవీశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం నాంపల్లె బీట్‌కు సంబంధించిన 20 ఎకరాల ఏఎన్ఆర్ ప్లాంటేషన్‌ను, ఐరాల సెంట్రల్ నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల అటవీశాఖ అధికారి రాకేష్‌కుమార్, బీట్ అధికారులు రెడ్డిప్రసాద్, పద్మావతి, నిశ్చలబాబు తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడుకు తరలిన ఒంటరి ఏనుగు

గుడిపాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రెండ్రోజులుగా గుడిపాల మండలంలో హల్‌చల్ చేస్తోన్న ఒంటరి ఏనుగు చివరకు తమిళనాడు పరిధిలోని అటవీ ప్రాంతానికి వెళ్లిపోయింది. మంగళవారం ఉదయం ఫారెస్ట్ బీట్ అధికారులు,సిబ్బందితో కలసి రేంజ్ ఆఫీసర్ థామస్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆనంద రెడ్డి బాణసంచా పేలుస్తూ మద్రాసు క్రాస్ రోడ్డు నుంచి బొమ్మసముద్రం-కనకనేరి అటవీ ప్రాంతాల మీదుగా తమిళనాడు ఫారెస్టుకు ఏనుగును తరిమివేయగలిగారు. దీంతో ఇటు అధికారులు, అటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



గుడుపల్లెలో ఈ-సైకిళ్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

గుడుపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఆర్థిక అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మండల టీడీపీ మండలాధ్యక్షులు అధ్యక్షులు బాబు నాయుడులు తెలిపారు. మంగళవారం వెలుగు కార్యాలయం ఆవరణలో ఈ-సైకిల్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మహిళలు మరింత అభివృద్ధి సాధించాలని సంకల్పించి ఆ దిశగా ఈ-సైకిళ్లను పంపిణీ చేస్తున్నారు. రూ.40 వేలు విలువైన సైకిళ్లను మహిళల కోసం సబ్సిడీతో రూ.9 వేలకు అందిస్తుందన్నారు. మహిళలు చిరు వ్యాపారం చేసుకొని ఆర్థికంగా ఎదగడానికి సైకిల్ పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు అమీర్, బీజేపీ మండలాధ్యక్షులు రామచంద్ర, టీడీపీ నియోజికవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, సర్పంచ్ వెంకటేసు గుడుపల్లె, గుండ్లసాగరం పార్టీ అధ్యక్షులు మంజునాథ్, సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, యువత అధ్యక్షులు లక్ష్మీపతి, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రకాష్, ప్రమీల, ఏపీఎం గ్రీటా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవాభావం కలిగిన వారే కుటుంబ సాధికార మిత్రలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ సేవా భావం కలిగిన వారినే కుటుంబ సాధికార మిత్రలుగా ఎంపిక చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. మంగళవారం బందార్లపల్లె పంచాయతీ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండేలా తమ పార్టీ కుటుంబ సాధికార మిత్ర వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. క్షేత్ర స్థాయిలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కుటుంబ సాధికార మిత్రలు కీలక పాత్ర పోషిస్తారన్నారు. సమావేశంలో పార్టీ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి మునిరెడ్డి, నేతలు పెరుమాళ్ళ, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ రెడ్డి, మురళీమోహన్, ఆనందరెడ్డి, రఘునాథరెడ్డి, కోదండరెడ్డి పాల్గొన్నారు.

ఏపీపీఆర్ వ్యవస్థాపక ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



పలమనేరు, మార్చి11(ఆంధ్రజ్యోతి) : పలమనేరు లో ఏపీపీఆర్ వ్యవస్థాపక ఉద్యోగ సంఘ ఎన్నికలు స్థానిక ఎన్జీవో హోంలో మంగళవారం ఏకగ్రీవంగా నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎస్.ఎన్.ఆలీ వ్యవహరించారు. అధ్యక్షులుగా కె.రాజశేఖర్ (సీనియర్ సహాయకులు, పెద్దపంజాణి), ఉపాధ్యక్షులుగా ఎం.గాయత్రి (టైపిస్టు, పీఐయు సబ్‌డివిజన్, పలమనేరు), సెక్రటరీగా ఎస్.ఇంతియాజ్(టైపిస్టు, బైరెడ్డిపల్లి), కోశాధికారిగా పి.కుమార్ (గంగవరం), జాయింట్ సెక్రటరీగా ఏసీ ఉషారాణి(టైపిస్టు, పలమనేరు), జిల్లా కౌన్సిలర్ 1గా జి.లక్ష్మీపతియాదవ్(సీనియర్ సహాయకులు, పలమనేరు), జిల్లా కౌన్సిలర్ 2 గా పి.పురుషోత్తం (టైపిస్టు, పలమనేరు) లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జడ్పీ కార్యాలయం నుంచి చలపతిరెడ్డి, సురేష్‌బాబు, శశి, తులసి, హరీష్, పలమనేరు ఎన్జీవో సంఘం అధ్యక్షులు ఆనందబాబు, పలమనేరు పీఆర్ వ్యవస్థాపక ఉద్యోగ సంఘ సభ్యులు జీవీ రాజేష్, బాలాజి, శాంతి, నాగరాజు, ప్రసాద్‌కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

మురుగు రహిత కుప్పమే లక్ష్యం



పూడికతీతను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మురుగు రహిత కుప్పం తన లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావవు అన్నారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 20వ వార్డులో మంగళవారం ఆయన దగ్గరుండి మురుగు కాలువల్లో పూడిక తీయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, అందుకు అనుగుణంగా మున్సిపల్ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు.

పాడిరైతుకు ఆర్థిక సాయం



సోమల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పార్వతీపురానికి చెందిన కృష్ణవేణి పాడిఆవు మృతి చెందడంతో రూ.37,500 బీమా చెక్కును మంగళవారం సోమల పశుసంవర్ధకశాఖ ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు అందజేశారు. 2024 డిసెంబరు 3న కురిసిన వర్షాలకు ఆవు మృత్యువాత పడింది. ఈక్రమంలో ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం మంజూరు చేసింది. పెద్దఉప్పరపల్లె పశువైద్యాధికారిణి చందనప్రియ పాల్గొన్నారు.

శ్రీవారికి వెండి ఆభరణాల కానుక



పుంగనూరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామికి పట్టణంలోని హైందవులు వెండి ఆభరణాలు, గజమాలను వితరణ చేశారు. మంగళవారం స్థానిక తూర్పుమొగసాలలో వెలసిన చాముండేశ్వరి ఆలయం నుంచి వెండి ఆభరణాలు, గజమాలను ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మునీంద్రబాబు, ఆలయ అర్చకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో వర్మీకంపోస్టు తయారీ



వర్మీతొట్టెల్లో వానపాములు వదిలిపెడుతున్న అధికారులు

బైరెడ్డిపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ఎస్‌డబ్ల్యుపీసీలో వర్మీకంపోస్టు తయారీ ప్రక్రియను ప్రారంభించినట్లు ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఈవోఆర్డీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం వర్మీకంపోస్టు తొట్టెల్లో వానపాములను వదిలిపెట్టి తయారీని అధికారులు పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారు చేసి గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చే దిశగా అన్ని పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యుపీసీలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సదాశివయ్య పాల్గొన్నారు.

ఇద్దరు ఇన్విజిలేటర్ల తొలగింపు

వి.కోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వి.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ముగ్గురు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులను డీబార్ చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎకనామిక్స్ పరీక్షకు హాజరైన ఇద్దరు విద్యార్థులు, ఫిజిక్స్ పరీక్ష రాస్తున్న మరో విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు సిట్టింగ్ స్క్వాడ్ హరిబాబు ఆధ్వర్యంలో గుర్తించారు. ముగ్గురిని డీబార్ చేశారు. అలాగే రెండు గదుల్లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఇన్విజిలేటర్లను సైతం పరీక్షల విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

పలమనేరుకు 700 కుట్టుమిషన్లు

పలమనేరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరు నియోజకవర్గంలోని మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కూటమి ప్రభుత్వం 700 కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో బీసీలకు 300, కమ్మలకు 108, రెడ్లకు 78, కాపులకు 61, ఈబీసీలకు 100, ఆర్యవైశ్యులకు 17, బ్రాహ్మణులకు 18, క్షత్రియులకు 13 కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నారన్నారు. ఇందుకోసం ప్రతి లబ్ధిదారు తప్పనిసరిగా శిక్షణ పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమాలకు తప్పనిసరిగా 75 శాతం హాజరు కావాల్సి ఉంటుందని.. లబ్ధిదారుల నుంచి త్వరలోనే దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

కాటిపేరిలో బండి దారి ఆక్రమణపై సర్వే



కాటిపేరిలో సర్వే చేస్తున్న జిల్లా సర్వేయర్ కృష్ణమూర్తి

చౌడేపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాటిపేరిలో బండి దారి ఆక్రమణపై జిల్లా సర్వేయర్ కృష్ణమూర్తి మంగళవారం సర్వే చేపట్టారు. తరతరాల నుంచి ఉన్న బండి బాటను ఆదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి ఆక్రమించుకున్నాడని పీజీఆర్ఎస్‌లో అదే గ్రామానికి చెందిన కుమార్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుతో సర్వే నిర్వహించగా బండిబాట ఆక్రమణలు జరిగాయని గుర్తించి నివేదికలను తహసీల్దార్, కలెక్టర్‌కు సమర్పించారు. కార్యక్రమంలో సర్వేయర్ గుణశేఖర్, సచివాలయ సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు బీమా చేయించుకోవాలి

పుంగనూరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు ప్రతిఒక్కరూ పశువులకు బీమా చేసుకోవాలని పశుసంవర్ధక సహాయ సంచాలకులు మనోహర్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పాడి ఆవులకు ఓసారి బీమా చేసుకుంటే దాని కాల పరిమితి మూడేళ్ల వరకు ఉంటుందని తెలిపారుజ. పశువులకు బీమా చేసుకున్న రైతులు పశువుల చెవులకు చెవిపోగు వేయించి నమోదు చేసుకోవాలన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రామకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లతో కుట్టుమిషన్ శిక్షణ కోసం రామకుప్పం మండల పరిధిలోని మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి కోరారు. కుట్టుమిషన్లు కావాల్సిన మహిళలు ఈనెల 7 నుంచి సంబంధిత సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకునే వారు 18-50 సంవత్సరాల మధ్య వయసు కలిగి తెల్లరేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ, ఆధార్‌కార్డులు తప్పక ఉండాలని ఆయన తెలిపారు. కుటుంబంలో ఒక్కరే అర్హులని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఉంటుందన్నారు. 45 రోజుల వ్యవధిలో రోజుకు 8 గంటలు, 60 రోజుల వ్యవధిలో 6 గంటలు, 90 రోజుల వ్యవధిలో 4 గంటల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారుల్లో శిక్షణ తరగతుల్లో 75 శాతం హాజరున్నవారికి శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రంతోపాటు ఉచితంగా కుట్టుమిషన్లను అందజేస్తామని వివరించారు.


చేపల మార్కెట్‌లో అధికారుల దాడులు



మార్కెట్‌లో దాడులు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పలమనేరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరు చేపల మార్కెట్‌లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది దాడులు నిర్వహించారు. చేపల మార్కెట్‌లో విక్రయించకూడని క్యాట్‌ఫిష్‌లను, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారులకు రూ.3500 జరిమానా విధించారు.

రిమ్మర్స్ పాఠశాలలో మహిళలకు సన్మానం



మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న నిర్వాహకులు

పలమనేరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని రిమ్మర్స్ దివ్యాంగుల పాఠశాలలో మంగళవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విశిష్ట సేవలందిస్తున్న తనూజ, కుమారమ్మ, ప్రేమలీల, వాణిలను శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు సుధాకర్, సీతారామాంజనేయ భక్తమండలి ఉప్పుశెట్టి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణోత్సవం





సోమల మండలం ఆవులపల్లె పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు, పుంగనూరులో మోహిని అవతారంలో స్వామివారు

సోమల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో టీటీడీ ఆధ్వర్యంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఉదయం ఆలయ శుద్ధి అనంతరం మూలవిరాట్‌కు వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి వేదమంత్రాల నడుమ స్వామివార్ల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను సుందరంగా గరుడవాహనంపై అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మహిళల కర్పూర నీరాజనాలు, చెక్కభజనలు, కోలాటాల నడుమ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల బలిజ సంఘ సభ్యులు ఉభయదారులు పాల్గొన్నారు. టీటీడీ అధికారులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మోహిని అవతారంలో ..

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి మోహిని అవతారంలో పట్టణ పురవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుష్ప పల్లకిలో ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. పట్టణంలోని బ్రాహ్మణవీధి, బజార్‌వీధి, తేరువీధి, కుమ్మరవీధుల మీదుగా ఊరేగించారు. సాయంత్రం గరుడసేవలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మునీంద్రబాబు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సింహవాహనంపై నరసింహుడి విహారం



కల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి వార్షికోత్సవం వేడుకల్లో భాగంగా మంగళవారం సింహవాహనంపై స్వామివారు ఊరేగారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రత్యేక వాహనంపై పురవీధుల్లో స్వామివారు విహరించారు. రాత్రి వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన లక్ష్మీ నారసింహుడు సింహవాహనంపై ఆశీనులయ్యారు. స్వామివారు నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతుండగా మహిళలు కర్పూర హారతులిచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. వాహనం ముందు కోలాటాలు, చెక్కభజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బోయకొండ గంగమ్మకు రూ.1.12 కోట్ల ఆదాయం



వేలంలో పాల్గొన్న ఆలయ ఈవో ఏకాంబరం

చౌడేపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయానికి వేలం ద్వారా రూ.1.12 కోట్ల ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. మంగళవారం రెండోరోజు కొండపై ఉన్న ఆలయ కార్యాలయంలో బోయకొండలో వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వేలం నిర్వహించారు. దిగువపల్లె పంచాయతీకి చెందిన మల్లిఖార్జున కొండపైన క్యాంటీన్, ఐస్‌క్రీం, కూల్‌డ్రింక్స్ విక్రయించుకునే హక్కును రూ.20.90 లక్షలకు, దిగువపల్లె పంచాయతీకి చెందిన రామకృష్ణ కొండ కింద క్యాంటీన్, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ విక్రయించుకునే హక్కును రూ.6.35 లక్షలకు, కొండపైన ఉన్న 4 దుకాణాల్లో పవిత్రధారాలు, బొమ్మలు, కలకండ తదితర వస్తువులను విక్రయించుకునే హక్కు మల్లిఖార్జున రూ.69 లక్షలతో హెచ్చు పాటదారుడిగా దక్కించుకున్నారు. కోళ్ల విక్రయించుకునే హక్కు లవకుమార్ రూ.6.80 లక్షలకు, ఫొటోలు తీసుకునే హక్కు రూ.1.79 లక్షలకు కిరణ్, కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు రూ.7.40 లక్షలతో రామకృష్ణ వేలంలో హక్కులు పొందారు. రెండో రోజు జరిగిన వేలంలో రూ.1,12,24,000 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఎస్‌ఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధన ఫలితాలతో అధిక దిగుబడులు



యాప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం రంగంలో పరిశోధన ఫలితాలను అందిపుచ్చుకోవడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు. పులిచెర్ల మండలం కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులకు వ్యవసాయంలో స్కిల్ ఆఫ్ చిత్తూరు- డిజిటల్ ట్రైనింగ్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ ధరలు, పంటల సమాచారం, వాతావరణంలోని మార్పులు, నాణ్యమైన పంటల దిగుబడి, చీడల నివారణ తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లు రూపొందించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి



దుర్యోధనుడు, భీముడి పాత్రలో ఉపాధ్యాయులు

కల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు, పాఠశాల వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీవాణి మాట్లాడుతూ పదో తరగతిలో పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించాలన్నారు. చదువులో పోటీతత్వం పెంపొందించుకోవాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు విద్యార్థులు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో దుర్యోధనుడు, భీముడి పాత్రల్లో ఉపాధ్యాయులు దొరస్వామి, కాటయ్య అందరినీ అలరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రఘువీరారెడ్డి కాలనీలో ఉద్రిక్తత



పోలీసులను అడ్డుకొంటున్న కాలనీ వాసులు

పలమనేరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ పరీక్షలు రాస్తున్న ఇద్దరు విద్యార్థుల మధ్య తలెత్తిన వివాదంతో రఘువీరారెడ్డి కాలనీలో మంగళవారం మధ్యాహ్నం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పరీక్ష కేంద్రం వద్ద పలమనేరు రఘు వీరారెడ్డి కాలనీకి చెందిన విద్యార్థి పాతపేటకు చెందిన విద్యార్థి పరస్పరం ఒకరినొకరు తోసుకున్నారు. ఇంటికి వెళ్లిన రఘువీరారెడ్డి కాలనీ విద్యార్థి కోసం పాతపేటకు చెందిన కొందరు చేరుకుని కాలనీలోని విద్యార్థిపై దాడికి పూనుకున్నారు. దీంతో కాలనీ వాసులు వారిని అడ్డుకొని వారి ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పలమనేరు సీఐ తన సిబ్బందితో రఘువీరారెడ్డికాలనీకి వెళ్లి రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. ఈ సమయంలో కాలనీకి చెందిన కొందరు ద్విచక్రవాహనాదారులను ఇక్కడికే పిలిపించి విచారించాలని పట్టుబట్టారు. పోలీసులను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. దీంతో పలమనేరు రూరల్, గంగవరం సీఐలు సైతం తమ సిబ్బందితో కాలనీకి చేరుకొని అక్కడ పోలీసులతో వాగ్వాదానికి దిగిన వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. అయితే మళ్లీ పోలీసులను కాలనీ మహిళలు అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. జరిగిన సంఘటనపై విచారిస్తున్నామని..బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు పలమనేరు సీఐ నరసింహరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సదుం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్కూలు బస్సును ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. సదుం ఎస్‌ఐ షేక్ షావలి కథనం మేరకు.. సదుం మండలం తిమ్మానాయునిపల్లె పంచాయతీ ఎగువ కురవపల్లెలో మంగళవారం ఉదయం స్కూల్ బస్సును ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఢీకొంది. దీంతో కురవపల్లెకు చెందిన జయచంద్ర, మాదిగపల్లెకు చెందిన కదిరప్ప తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో పీలేరు ఆసుపత్రికి తరలించారు.

తీర్థం పీహెచ్‌సీ తనిఖీ



తీర్థం పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

బైరెడ్డిపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం జడ్పీఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. తీర్థం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, గ్రామకార్యదర్శి రాజశేఖరాచారి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం గణేశ్‌పురం క్రాస్ వద్ద ఎక్సైజ్ పోలీసుల దాడిలో అక్రమంగా తరలుతున్న 864 కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టుబడ్డాయి. మద్యం స్వాధీనం చేసుకుని తరలిస్తున్న గనేశ్‌పురం గ్రామానికి చెందిన దేవేంద్రన్, పన్నీర్ సెల్వం, కదిరవన్ అనే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలను సైతం సీజ్ చేశామని తెలిపారు. సీఐ నాగరాజుతో పాటు ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది చలపతి, వెంకటేశ్, రమేశ్, రాజేశ్ పాల్గొన్నారు.

శేషవాహనంపై నలగుండ్రాయస్వామి

బైరెడ్డిపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం గ్రామంలో వెలసిన నలగుండ్రాయస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శేషవాహనంపై స్వామి వారు విహరించారు. ధర్మకర్త మురళీస్వామి, కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి

రొంపిచెర్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత పై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలంలోని బొమ్మయ్యగారిపల్లెలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట చెత్తసేకరణ జరుగుతోందని.. తడిచెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలో నూతన విద్యావ్యవస్థ ప్రణాళికలో భాగంగా కొత్తగా మూడు మోడల్ ప్రైమరీ సూల్స్ వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించబడతాయని.. ప్రతి పాఠశాలకు ఐదు నుంచి ఆరు మంది ఉపాధ్యాయులు కేటాయించడం జరుగుతోందని తెలిపారు. ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శి హరిబాబు, పుంగనూరు నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు సహదేవ, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తనుంచి సంపద తయారీపై శిక్షణ

చౌడేపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె సమీపంలోని ఎస్‌డబ్ల్యూ పీసీ సెంటర్‌లో నియోజకవర్గం స్థాయి పంచాయతీ అధికారులకు, గ్రీన్ అంబాసిడర్లకు మంగళవారం డీపీవో సుధాకర్‌రావు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, ఈవోపీఆర్డీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పాడిఆవు దొంగ అరెస్టు

గంగవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పాడిఆవు చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 8న కూర్నిపల్లెలోని రైతు శివకుమార్‌కు చెందిన పాడి ఆవు చోరీ కి గురైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా మంగళవారం చలమంగళం గ్రామ సమీపంలో ఓ వ్యక్తి పాడి ఆవును అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని పాడిఆవును స్వాధీనం చేసుకొని చోరీకి పాల్పడిన చలమంగళం గ్రామానికి చెందిన సహదేవను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

హానికర ప్లాస్టిక్ కవర్ల వాడకంపై ఉక్కుపాదం

● నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి


దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు

నగరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హానికర ప్లాస్టిక్ కవర్ల వాడకంపై ఉక్కుపాదం మోపుతామని నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలో మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో పలు దుకాణాల నుంచి హానికర ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారులకు రూ.5000 జరిమానా విధించారు. అలాగే హోటళ్లు, బేకరీల్లోని ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. కల్తీ ఉంటే తప్పవని హెచ్చరించారు. ఏఈ హేమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, కుమార్, మేస్త్రీలు పాల్గొన్నారు.

కళ్లను కాపాడుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అపోలో నర్సింగ్ విద్యార్థులు

చిత్తూరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కళ్లను కాపాడుకోవాలని ఆర్ఎంవో సంధ్య అన్నారు. గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు అర్పిత, లత, అపోలో నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్నాలజీపై రైతులకు అవగాహన కల్పించాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న హిమవంశీ

పెనుమూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీపై రైతులకు అవగాహన కల్పిస్తే పంటలపై వారే సొంత నిర్ణయాలు తీసుకోవచ్చని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ అన్నారు. మంగళవారం మండలంలోని రైతుసేవ కేంద్రంలో స్కిల్ అప్ చిత్తూరు - డిజిటల్ ట్రైనింగ్‌పై రైతులకు, వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ట్రైనర్ మోహన్ మాట్లాడుతూ.. పంటను ఫొటోతీసి యాప్‌లో అప్లోడ్ చేస్తే వాడాల్సిన మందులను రైతులు తెలుసుకోవచ్చన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఏడీఏ ఉమా, నాగపద్మిని, ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

యాదమరి: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శిక్షణ అధికారి నదీమ్, పర్యవేక్షక అధికారి ఉమామహేశ్వరి, ఏవో చరిత, స్థానిక వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సర్వేను తనిఖీ చేసిన డీపీఎంవో


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ప్రవీణ బృందం

యాదమరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కమ్యూనికబుల్, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ సర్వేను జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రవీణ యాదమరి పీహెచ్‌సీ పరిధిలోని సంతగేటు గ్రామంలో మంగళవారం తనిఖీ చేశారు. ఇంటి దగ్గర లేనివారిని చనిపోయినవారిగా, వలసలు వెళ్లినవారిగా పలు ప్రాంతాల్లో నమోదు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయని చెప్పారు. సర్వేను వందశాతం పక్కాగా పూర్తి చేయాలన్నారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆర్కేవీబీ పేటలో ట్యాంకర్లతో నీటి సరఫరా

వెదురుకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీ పేటలో నెలకొన్న తాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని మంగళవారం ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. గ్రామంలో నీటి సమస్యపై సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నాగరతమ్మ స్పందించి ట్యాంకర్లతో నీటి సరఫరాకు చర్యలు చేపట్టారు.

క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం


విజేతలతో ఎంఈవో విజయకుమార్ తదితరులు

వెదురుకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కల్గుతుందని కార్వేటినగరం ఎంఈవో విజయకుమార్ అన్నారు. మంగళవారం కార్వేటినగరం మండలం కత్తెరపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఆయన క్రీడలను ప్రారంభించారు. విద్యతోపాటు క్రీడల్లోనూ ఎదగాలని ఆకాంక్షించారు. తర్వాత విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేడ, చెత్త దిబ్బల తొలగింపు



వెదురుకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అల్లమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న పేడ, చెత్త దిబ్బలను మంగళవారం తొలగించారు. డీడీవో మోహన్‌కుమార్, టీడీపీ నాయకుడు దామోదరం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

తడి, పొడి చెత్తపై అవగాహన

పూతలపట్టు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తేనేపల్లె, వేపనపల్లె, కొత్తకోట తదితర పంచాయతీల్లో తడి, పొడిచెత్తపై ఈవోపీఆర్డీ శ్రీనివాసులు మంగళవారం అవగాహన కల్పించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని పంచాయతీ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, శ్రీరాములు, హేమలత, డిల్లీబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీని అరికట్టలేరా?


రోడ్డుపై పారుతున్న తాగునీరు

నగరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అసలే ఎండలు మండిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో నగరి పట్టణంలోని పెరుమాళ్ గుడి వీధిలో తాగునీటి పైపులైన్ 15 రోజులుగా లీకవుతోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వదిలేస్తే తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం కూడా ఉందని వాపోతున్నారు.

చేతిబోర్ల మరమ్మతులపై ప్రభుత్వ దృష్టి


వెదురుకుప్పం, జీటీకండ్రిగలో చేతిబోర్ల దుస్థితి

వెదురుకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని చేతిబోర్ల మరమ్మతులపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. వైసీపీ హయాంలో వీటి బాగోగులు పట్టించుకోక పోవడంతో చాలా ప్రాంతాల్లో అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. కార్వేటినగరం మండలంలో 221, వెదురుకుప్పంలో 243 చేతిబోర్లు ఉన్నాయని అధికారిక లెక్క. వీటిల్లో పనిచేసే బోర్ల సంఖ్యను మాత్రం వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. ఈ నేపథ్యంలో వెదురుకుప్పం మండలంలోని చేతిబోర్లకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు రూ.3లక్షలు, కార్వేటినగరం మండలంలో రూ.4లక్షలను ఆయా ఎంపీడీవోలు కేటాయించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పైపులు, ఇతర సామగ్రి మాయం

చేతిబోర్లలో చాలాచోట్ల పైపులు, ఇతర సామగ్రి మాయమయ్యాయి. కొన్నిచోట్ల పూర్తిగా పాడైపోయాయి. అధికారులు పట్టించుకోక పోవడం వల్లే ఇలా జరిగిందన్న విమర్శలూ ఉన్నాయి. ఈ క్రమంలో చేతిబోర్ల వివరాలను కచ్చితంగా ఇవ్వాలని కూటమి ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలో రక్షిత మంచినీటి పథకాలు వచ్చాక చేతి బోర్లు వాడకంలో లేవని.. మరమ్మతులకు గురైన వాటినీ తక్కువగా చూపుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి: కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సమయపాలన పాటించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో మండల ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గ్రామ, వార్డు సచివాలయాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. గుర్తించిన సమస్యలను జిల్లాస్థాయిలో చర్చిస్తే.. వీలున్నంత వరకు వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి


కృష్ణన్ (ఫైల్ ఫొటో)

యాదమరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఓ కూలీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మాధవరం గ్రామంలోని ఓ ఇటుకల బట్టీలో తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా కడియంపట్టి తాలుకా నడుపట్టీ గ్రామానికి చెందిన కృష్ణన్ దంపతులు కూలీలుగా పనిచేస్తున్నారు. గతవారం దంపతులు స్వస్థలానికి వెళ్లారు. మూడ్రోజుల కిందట కృష్ణన్ ఒక్కడే మాధవరం వచ్చాడు. సోమవారం రాత్రి ఏం జరిగిందో ఏమో.. మంగళవారం తెల్లారేసరికి కృష్ణన్ విగతజీవిగా పడివున్నాడు. మృతుడి సోదరుడు మురుగన్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు యాదమరి పోలీసులు నమోదు చేశారు. కృష్ణన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

5 లీటర్ల సారా స్వాధీనం: ఒకరి అరెస్టు

వెదురుకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంటు ఇన్‌స్పెక్టరు సత్యనారాయణ మంగళవారం వివరాలను తెలిపారు. వేణుగోపాలపురం అలియాస్ బూడిదపల్లె ఎస్సీ కాలనీ క్రాస్ వద్ద బి.గోపాల్ వద్ద ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేశామని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


వివరాలు తెలుసుకుంటున్న నోడల్ ఆఫీసర్ వెంకటరమణ

పాలసముద్రం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నోడల్ ఆఫీసర్ వెంకటరమణ ఆకాంక్షించారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెంగళరాజుకుప్పం బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. తిరుమలరాజుపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రాజేంద్రప్రసాద్, గిరిజ, హెచ్ఎం సుధాకర్, టీచర్లు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి రథోత్సవం

గుడిపాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన వళ్లిమలైలో వళ్లీ సమేత సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు రథంపై మిరియాలు చల్లి మొక్కులను తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డీఎంవో కార్యాలయంలో ఏడీ


అధికారులతో మాట్లాడుతున్న రామనాథరావు

చిత్తూరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా మలేరియా కార్యాలయాన్ని అడిషనల్ డైరెక్టర్ (ఏడీ) రామనాథ రావు మంగళవారం పరిశీలించారు. జిల్లాలో మలేరియా నివారణకు చేస్తున్న కార్యక్రమాలను ఆరా తీశారు. డీఎంవో వేణుగోపాల్, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి పాల్గొన్నారు.

వైసీపీ మేధావుల సంఘం కార్యదర్శిగా జగదీశ్వర్ రెడ్డి



పూతలపట్టు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మేధావుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జగదీశ్వర్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు అధ్యక్షుడు ఈశ్వర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

ఏదో విశేషం ఉన్నట్టే ఉంది!


ప్రభుత్వ విప్ థామస్‌కి పుష్పగుచ్ఛమిస్తున్న పీఏసీఎస్ సీఈవో దుష్యంత్

వెదురుకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్‌ను మంగళవారం అమరావతిలో కార్వేటినగరం పీఏసీఎస్ (సింగిల్ విండో) సీఈవో దుష్యంత్ కలసి పుష్పగుచ్ఛమిచ్చారు. నాయకులను అధికారులను కలవడం సహజం. అయితే ఈయన సతీమణి దివ్య.. కార్వేటినగరం మండలంలోని ఆర్కేవీబీపేట గ్రామ సర్పంచ్ కావడం, వైసీపీ వ్యక్తిగా ముద్ర ఉండటం, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామికి అనుచరులుగా గుర్తింపు ఉండటం వల్ల ఈ అంశం రాజకీయంగా చర్చనీయాంశమైంది. పైగా ఆయనవెంట టీడీపీ నేత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గోవిందస్వామి ఉన్నారు. దీంతో దివ్య టీడీపీ గూటికి చేరిపోతారంటూ ప్రచారం జోరందుకుంది. వాట్సాప్ గ్రూపుల్లోనూ ఈ ఫొటో వైరల్‌గా మారింది.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



యాదమరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పగటిపూట అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఏపీవో బాల పంపిణీ చేశారు. కలెక్టర్, పథక సంచాలకుల ఆదేశాలతో మాధవరం గ్రామపంచాయతీలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆశవర్కర్లతో అందజేశామని చెప్పారు. భూదేవి, గౌతమి, ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



చిత్తూరు సెంట్రల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): డిల్లీ సమీపంలోని నోయిడాలో నిర్వహించిన అఖిల భారత విశ్వవిద్యాలయాల సాంస్కృతిక సమ్మేళనంలో విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సంధ్యకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ మేరకు విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. మంగళవారం సంధ్యను అకడమిక్ డైరెక్టర్ శైలజ మూర్తి, అధ్యాపక బృందంతో కలిసి ఆయన అభినందించారు.

ఘనంగా మేయర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మేయర్ అముద జన్మదిన వేడుకలను మంగళవారం నగరపాలక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కమిషనర్ నరసింహప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

శాస్త్రోక్తంగా ప్రదోషకాల పూజలు


ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరుడికి శాస్త్రోక్తంగా ప్రదోషకాల పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు కోదండపాణి మొదలియార్ పర్యవేక్షించారు.

సంక్షిప్తంగా..

వెదురుకుప్పంలో వర్షం

వెదురుకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పంలో మోస్తరు వర్షం కురిసింది. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం వల్ల ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురవడంతో జనానికి ఉపశమనం లభించింది.

లైంగిక దాడులు జరక్కుండా చూసుకోవాలి

చిత్తూరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు అందరిపై ఉందని సైకాలజిస్ట్ అరిషా అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో 'పిల్లలపై లైంగిక వేధింపులు ఏ విధంగా నివారించాలి' అనే విషయంపై లైన్ డిపార్ట్‌మెంట్ శాఖల్లో పనిచేసే సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌వో సుధారాణి, ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

శ్రీరంగరాజపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మంగుంటలోని లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శేష వాహనంపై ఊరేగించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటాచలపతి పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ

వెదురుకుప్పం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్త సేకరణకు సర్పంచ్ తులసికుమారి, ఎంపీటీసీ సభ్యుడు ధనశేఖర్ యాదవ్ చేతుల మీదుగా చెత్త బుట్టలను మంగళవారం పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి గోపి, ఉద్యోగులు పాల్గొన్నారు.

దుస్తుల వితరణ

వెదురుకుప్పం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దాన ధర్మాలకు ప్రతీక రంజాన్ పర్వదినమని గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి తెలిపారు. మంగళవారం కార్వేటినగరంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తౌబీరాఖాన్ ఆధ్వర్యంలో కృపాలక్ష్మి చేతుల మీదుగా పలువురికి చీరలు, పంచెలు అందజేశారు. వైసీపీ మండల అధ్యక్షుడు శేఖర్‌రాజు, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి చందురాజు, సర్పంచ్ ధనంజయవర్మ, నాయకులు శేషాద్రి, రఫీ, సద్దాం, ముస్తాఫ్, షబ్బీర్, హిషాదాఖాన్ పాల్గొన్నారు.

17న టేకు చెట్ల వేలం

నగరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని 23 టేకు చెట్లను ఈనెల 17వ తేదీన వేలం వేయనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. టేకుచెట్లను నరకడానికి జిల్లా ఫారెస్టు అధికారి అనుమతి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 17న ఉదయం 11 గంటలకు వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

ఘనంగా అభిషేక పండుగలు

వెదురుకుప్పం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని బేతేల్ షరోన్ చర్చి పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో మంగళవారం 21వ అభిషేక పండుగలను ఘనంగా జరుపుకున్నారు. రెవా థామస్ చెకో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పొద్దుటూరు కల్యాణ్‌బాబు, మోసెస్ బాలన్, పాస్టర్లు, విశ్వాసకులు హాజరయ్యారు.

యువత పోరు పోస్టరు ఆవిష్కరణ

విజయపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): యువత పోరు పోస్టరును మంగళవారం విజయపురంలో వైసీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివరాజు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మంజుబాలాజి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్ నాయుడు, నాయకులు సతీష్‌యాదవ్, ప్రసన్నకుమార్, ప్రతాప్‌రాజు, శేఖర్‌రాజు, రమేష్ రెడ్డి, జిల్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు ల్యాప్‌టాప్‌ల చోరీ

గంగవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరు-బెంగళూరు రహదారిలో గంగవరం మండల పరిధిలోని ఓ హోటల్ వద్ద రెండు ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయ్యాయి. గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నగరానికి చెందిన చాందిని అనే యువతి బెంగళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఈనెల 8వ తేదీన బెంగళూరు నుంచి రెండు ల్యాప్‌టాప్‌లను బ్యాగులో పెట్టుకొని చిత్తూరుకు బస్సులో బయల్దేరారు. గంగవరం మండల పరిధిలోని పొన్నమాకులపల్లె సమీపంలోని ఓ హోటల్ వద్ద భోజనం కోసం బస్సును ఆపారు. తన వద్ద ఉన్న రెండు బ్యాగులను బస్సు సీట్లో పెట్టి హోటల్‌లో భోజనం చేసి వచ్చేసరికి ల్యాప్‌టాప్‌లు కనిపించలేదు. ఈ చోరీపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

19న పెనుమూరు బస్టాండు షాపింగ్ కాంప్లెక్స్ వేలం

పెనుమూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు బస్టాండు షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎట్టకేలకు వేలం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. గత ప్రభుత్వంలో సుమారు రూ.90 కోట్ల జడ్పీ నిధులతో భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆంధ్రజ్యోతిలో పలుమార్లు ఈ భవనంపై కథనాలు వెలువడ్డాయి. కూటమి నాయకులు కొందరు స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు ప్రతిపాదనలను సిద్ధం చేసి జడ్పీ, డీపీవో, కలెక్టర్‌కు పంపారు. కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈనెల 19న తేదీన పెనుమూరు సచివాలయంలో 24 షాపులకు వేలం పాట ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. 1,2,3,4 షాపులు ఎస్సీలకు, 19వ షాపు ఎస్టీలకు రిజర్వు అయింది. మూడేళ్ల కాలపరిమితితో షాపులను కేటాయిస్తారు. ఆసక్తి ఉన్నవారు పెనుమూరు పంచాయతీ సెక్రటరీ పేరుతో రూ.50వేల డీడీ, చెక్కు ద్వారా చెల్లించాలి. వేలం పాటలో ఖాయమైన వారు మూడ్రోజుల్లో మూడు శాతం స్టాంపు డ్యూటీని, నిబంధనల మేరకు ఆదాయపు పన్ను, జీఎస్టీ చెల్లించాలని ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభుకిరణ్ తెలిపారు.

తీర్థం పీహెచ్‌సీ తనిఖీ

బైరెడ్డిపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండలంలోని తీర్థం పీహెచ్‌సీని మంగళవారం జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సూచనలిచ్చారు.